క్లుప్తంగా

కార్మికుల ఆరోగ్యమే ప్రధానం



ఆర్టీసీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జమ్మలమడుగు : ఆర్టీసీ కార్మికులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సక్రమంగా నిర్వహించగలరని డిపో మేనేజర్ ప్రవీస్ తెలిపారు. గురువారం స్థానిక డిపో ఆవరణలో ఆర్టీసీ కార్మికులకు కేర్ హోమియో వైద్యులు ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు, గ్యారేజిలో పనిచేసే కార్మికులకు కంటి చూపుతో పాటు ఆరోగ్యంగా ఉంటేనే వాహనాలు నడుపగలరన్నారు. కార్మికుల కోసం ప్రత్యేకంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామని ప్రతి కార్మికుడు వైద్య పరీక్షలను చేయించుకోవాలని సూచించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



రోగులకు రాగిజావ పంపిణీ చేస్తున్న కళాశాల విద్యార్థులు

పులివెందుల టౌన్ : చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడంవల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని కళాశాల అసోసియేట్ డీన్ ఎం.సర్దార్ బేగ్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ ఆధ్వర్యంలో విద్యార్థుల బృందం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రాగిజావా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తూ చిరుధాన్యాలను ప్రజలకు అలవాటు చేయడం కోసమే ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీచింగ్ అసోసియేట్ దశరథరామిరెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు రాజు, రాజశేఖర్ దితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ కె.కెసుధ

పెద్దముడియం : మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ కె.కె.సుధ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీఓ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి పనుల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్‌క్లినిక్‌లు ఏర్పాటు చేసిందని, సిబ్బంది బాధ్యతతో పని చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సమస్యలు ఉంటే మొదట అధికారులకు తెలపాలని పరిష్కారం కానప్పుడు స్పందన ద్వారా అర్జీలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎలక్ట్రికల్ బెల్ వితరణ

లింగాల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గురువారం పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణమోహన్ రూ.10 వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ బెల్‌ను వితరణగా అందించి మాట్లాడారు. ఎలక్ట్రికల్ బెల్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం విద్యుత్ గంట పనిచేస్తుందని.. పాఠశాల సమయపాలనకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాలకు సహాయ సహకారాలు అందించిన టీచర్ కృష్ణమోహన్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ ప్రసాద్, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాలయానికి విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భక్తులు

చెన్నూరు : మండలంలోని దౌలతాపురంలో నూతనంగా నిర్మించే శ్రీసీతారామలక్ష్మణ సమేత వీరాంజనేయస్వామి నూతన దేవాలయ నిర్మాణానికి గురువారం సాయినాథశర్మ అభిమానులు రూ. లక్ష నగదు విరాళంగా రామాలయ కమిటీ సభ్యులకు గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టాలనే విషయాన్ని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన స్పందించి దేవాలయానికి ప్రభుత్వ అనుమతులతోపాటు టీటీడీ ద్వారా ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలుంటాయన్నారు.

ప్రభుత్వ, ప్రజాసంక్షేమానికి పాటు పడండి

వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి

పులివెందుల : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు జర్నలిస్టులు అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పాత సత్రంబడి పాఠశాల ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌ను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ అనేది పులివెందుల ప్రాంత జర్నలిస్టుల చిరకాల కోరిక అని.. ఎన్నో సంవత్సరాలుగా ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేయాలనుకునేవారి కల నేడు సాకారమైందన్నారు. ప్రెస్‌క్లబ్‌లోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులందరూ ఐకమత్యంగా ఉండి ప్రజా సంక్షేమానికి పాటుపడాలన్నారు. పాత్రికేయులకు కానీ, ప్రెస్‌క్లబ్‌కు కానీ ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తెస్తే వాటిని తప్పకుండా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. జర్నలిస్టులకు జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అంతకముందు పాత్రికేయులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం..

వైఎస్సార్ ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పాత్రికేయ సోదరులు పాత్రికేయ సంక్షేమ నిధికి నిధులు మంజూరు చేయాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించి తప్పకుండా తమవంతు సాయం అందిస్తానన్నారు. అలాగే ఇటీవల మృతి చెందిన పాత్రికేయుడు సాయంకాలం రత్నం, మాజీ పాత్రికేయుడు సీతారాం కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేయగా.. అందుకు ఎంపీ వారి కుటుంబాలకు తప్పకుండా అండగా ఉంటామని పాత్రికేయులకు భరోసా ఇచ్చారు.

ప్రెస్‌క్లబ్‌కు విరాళం

వైఎస్సార్ ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కౌన్సిలర్ కోడి రమణ తనయుడు వంశీ ప్రెస్‌క్లబ్‌కు రూ.50వేల విరాళాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతులమీదుగా పాత్రికేయులకు అందించారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి రూ.20వేలు టీచర్స్ తరపున ప్రెస్‌క్లబ్‌కు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల రామలింగారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, అంబకపల్లె నారాయణస్వామి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

సింహాద్రిపురం : మండలంలోని లోమడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పవన్‌చంద్రారెడ్డి తండ్రి దిద్దేకుంట సుబ్బారెడ్డి ఈనెల 7వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం పవన్ చంద్రారెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ రాజాబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్ యాదవ్ తదితరులు ఉన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : ఏపీ టూరిజం రాష్ట్ర డైరెక్టర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని గురువారం కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పెద్దనాన్న మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చిలేకాంపల్లె బెల్లం కృష్ణారెడ్డి కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న ఎంపీతోపాటు పులివెందుల ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డిలు చిలేకాంపల్లెకు వచ్చి కృష్ణారెడ్డి సమాది వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో పాటు కృష్ణారెడ్డి సోదరులు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బెల్లం లోకనాథరెడ్డి, వేదమూర్తిరెడ్డి, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండల సమన్వ యకర్త ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు, ఎంపీపీ మాధవీబాలకృష్ణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, యూత్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి శంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, పార్టీ నేతలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బెల్లం కృష్ణారెడ్డి సమాది వద్ద పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఎన్నికల బందోబస్తు పర్యవేక్షించిన డీఎస్పీ



పంచాయతీ ఎన్నికలపై సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

ముద్దనూరు : మండలంలోని కొలవలి గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల బందోబస్తును డీఎస్పీ నాగరాజు గురువారం పర్యవేక్షించారు. స్థానిక సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ చంద్రమోహన్‌లతో కలసి ఆయన పోలింగ్ బూత్‌లను పరిశీలించి అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికలు నిర్వహించనున్న 3 పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో నియమించిన సిబ్బందితో ఆయన మాట్లాడారు. పోలింగ్ సందర్భంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ సీఐ, ఎస్ఐలను ఆదేశించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

సింహాద్రిపురం : స్థానిక ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలలో సచివాలయ ఉద్యోగస్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిని గురువారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కలసి వారి సమస్యలను తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఆప్కాస్‌లో ఉన్న ఉద్యోగస్తులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని లేకపోతే కాంట్రాక్టు ఉద్యోగస్తులుగా గుర్తించాలని కోరారు. న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ, కాంట్రాక్టు ఉద్యోగస్తులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉరుటూరు గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడే ఉన్న అధికారులకు తెలిపి పరిష్కరించారు. వర్షాలు కురిసిన సమయంలో బజార్లలో నీరు నిలువ ఉంటోందని దీంతో దోమలు అధికమవుతున్నాయని, పక్కాగృహాలు, పింఛన్‌లు మంజూరు చేయాలని ఆయనను కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత కలిగి ఉండి మంజూరుకాని వారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలకు సూచించారు. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా వెంటనే ప్రజలకు తెలియజేయాలని, అర్హులను గుర్తించి వారికి అవసరమైన పత్రాలను అందజేసి పథకాలు అందేలా చూడాలని వలంటీర్లకు సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చురుగ్గా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, సర్పంచు లక్ష్మీదేవి, ఎంపీటీసీ లక్ష్మిరామాంజనమ్మ, స్థానిక నాయకులు గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న మహిళా మార్ట్ దేశానికే గర్వ కారణం



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల : పులివెందులలో ఉన్న జగనన్న మహిళా మార్ట్ దేశానికే గర్వకారణమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మెప్మా ఎండీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మెప్మా అధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ జగనన్న మహిళా మార్ట్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. జగనన్న మహిళా మార్ట్‌ను ఆర్థికంగా మరింత ముందుకు తీసుకెళతామన్నారు. అంతకముందు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వారు పంచ ప్రాస్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మెప్మా అధికారులు రమేష్, ఆదినారాయణస్వామి, శ్రీనివాసరావు, గంగులయ్య, నాయుడు, నాగన్న, హరిత, ఆర్పీలు పాల్గొన్నారు.

అధిక మందుల వాడకం అనర్థాలకు మూలం



పొలంబడి కార్యక్రమంలో ఆకుల కత్తిరింపు కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ నవంత్‌బాబు

చక్రాయపేట : రైతులు తాము సాగుచేసిన వరి పంటకు అధికంగా క్రిమిసంహారక మందులు వాడకం వల్ల లాభాల కంటే అనర్థాలే అధికంగా ఉంటాయని మండల వ్యవసాయ అధికారి నవంత్‌బాబు తెలిపారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.రాజుపల్లె వద్ద గురువారం వరిపంటలో దీర్ఘ కాలిక ప్రయోగం అయిన ఆకుల కత్తిరింపు కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక చదరపు మీటరులో ఆకులను 50 శాతం, ఇంకొక చదరపు మీటరులో 75 శాతం మేర ఆకులను కత్తిరించి పునరుత్పాదకశక్తిని తెలియజేసే ప్రయోగమని రైతులకు వివరించారు. దీనివల్ల మొక్క తనంతట తానుగా పునర్ వ్యవస్థీకరణ చేసుకుంటుందని గమనించాలన్నారు. ప్రయోగం నిర్వహణ సందర్భంగా ఆకులపై ఉన్న చిన్నచిన్న పురుగులను గుర్తించి వీటిలో అధికంగా మొక్కలకు మేలు చేసే రకాలు ఉన్నాయని అధికంగా పురుగుల మందులు వాడటం వల్ల అధిక ఖర్చుతో పాటు అనర్థాలు కూడా జరుగుతాయన్నారు. ప్రకృతి పరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ప్రసాద్, సేంద్రీయ వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

క్రీడలపై యువత ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

చెన్నూరు : క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహద పడతాయని, అలాగే శారీరక ధృడత్వానికి తోడ్పాటు అందిస్తాయని మండల స్పెషల్ ఆఫీసర్ సీహెచ్ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ గంగనపల్లె సురేష్‌బాబు తెలిపారు. గురువారం మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్ర' సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌కు సంబంధించి మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ప్లేయర్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయవలసి ఉంటుందని, గ్రామస్థాయిలో ప్రతి ఇంటికి ఈ సమాచారం చేరవేసి వీలైనంత ఎక్కువ మంది క్రీడాకారులు నమోదు అయ్యేలా చూడాల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్ పఠాన్ అలీ ఖాన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఐదు రకాల గేమ్స్ ఉంటాయన్నారు. ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్ ప్రతి ఆటలో పాల్గొనవలసిన క్రీడాకారుల సంఖ్యను పెంచేవిధంగా చూడాలన్నారు. మండల అభివృద్ధి అధికారి సురేష్‌బాబు మాట్లాడుతూ 17 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఈ టోర్నమెంట్లకు అర్హులని, సచివాలయాల పరిధిలో ఈ టోర్నమెంట్‌లు జరుగుతాయని, ఒక ప్లేయర్ 2 గేమ్స్ ఆడే అర్హత కల్గి ఉంటారన్నారు. ఆన్‌లైన్ చేసుకోవడానికి ఆగస్టు 14 నుంచి సెప్టెంబర్ 25 వరకు గడువు ఉంటుందన్నారు. మండలాధ్యక్షుడు చీర్ల సురేష్‌యాదవ్ మాట్లాడుతూ అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు ఈ టోర్నమెంట్ నిర్వహణకు సహకరించి విజయవంతం చేయాలన్నారు. మండల విద్యాశాఖాధికారి గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఈ టోర్నమెంట్లలో పాల్గొనవచ్చని, స్పోర్ట్స్ కోటానందు ఉద్యోగం పొందిన వారు అనర్హులని తెలిపారు. మండల విద్యాశాఖాధికారి సునీత మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ అక్టోబర్ 2 నుంచి 8 వరకు సచివాలయ పరిధిలో, 9 నుంచి 23 తేదీ వరకు మండలస్థాయిలో, 24 నుంచి 29వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, అక్టోబర్ 30 నుంచి జిల్లాస్థాయిలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరీలు, మెడికల్ ఆఫీసర్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజీల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568 286189, 99631 70177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆయుర్వేద వైద్యశాల వల్లూరుకు మార్పు



ఆయుర్వేద వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీవో జుబేద

వల్లూరు : మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామంలో దాదాపు 25 సంవత్సరాలకు పైగా నడుస్తున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శాలను వల్లూరులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి మార్చినట్లు ఆయుర్వేద వైద్యులు రామమూర్తి నాయక్ తెలిపారు. ఇకపై వైద్య సేవలు ఇక్కడే కొనసాగుతాయని తెలిపారు. కావున మండలంలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఆయుర్వేద వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశీలించిన ఎంపీడీవో

వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శాలను ఎంపీడీవో జుబేద గురువారం సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న వైద్య సేవలను పరిశీలించి వైద్యం పొందుతున్న వారితో మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి ఉక్కు సదస్సు

కడపవైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.

అవసరం మేరకే టీచర్లను సర్దుబాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో అవసరమైన సబ్జెక్టు టీచర్ల మేరకు మాత్రమే సర్దుబాటు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం డీఈఓ రాఘవరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలలోపు పదవీ విరమణ చేయబోయే ఉపాధ్యాయులను పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. మండలాలలో మిగులు ఉపాధ్యాయులను సీనియార్టీ ప్రాతిపదికన కౌన్సిలింగ్ విధానంలో పాఠశాలలకు కేటాయించాలని కోరారు.

ఎర్రగుంట్లను పచ్చదనంగా మారుస్తాం



పట్టణంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డిలు

ఎర్రగుంట్ల : పట్టణంలో అధికంగా మొక్కలను నాటి పట్టణాన్ని పచ్చదనంగా మారుస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని జాతీయ రహదారిలోని డివైడర్ మధ్యలో ఆయన మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎర్రగుంట్ల అభివృద్ధిని అప్పటి టీడీపీ నాయకులు పట్టించుకోలేదని కేవలం వారి స్వలాభం చూసుకున్నారని విమర్శించారు. కానీ వైఎస్సార్ ప్రభుత్వం హాయంలో మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సారథ్యంలో ఎర్రగుంట్లను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. నూతనంగా మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ కేంద్రం, జాతీయ రహదారి, వలసపల్లి రోడ్డులో డ్రైనేజీ సీసీ రోడ్డు, నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలలో, కళాశాలలో ప్రభుత్వ ఆసుపత్రులలో అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. జాతీయ రహదారితో పట్టణ రూపురేఖలు మారిపోయాయన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యానారాయణరెడ్డి, కౌన్సిలర్లు మహమ్మద్ ఆలీ, ఎరికలరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రశాంత్, పెన్నార్‌రషీద్, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, కమిషనర్ పి.జగన్నాథ్, వెంకటశివారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, రాజారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, గంగాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పత్రాలు పంపిణీ

పట్టణంలోని అర్హులైన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి పట్టణంలోని 1వ వార్డు సచివాలయంలో గురువారం అందజేసి మాట్లాడారు. పట్టణంలోని టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పి.జగన్నాథ్, కౌన్సిలర్ మహమ్మద్‌ఆలీ, 1వ వార్డు ఇన్‌చార్జి ప్రశాంత్, అడ్మిన్ సెక్రటరీ భవానీ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటు నమోదు ప్రక్రియ



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశులు

పులివెందుల టౌన్ : పారదర్శకంగా ఓటు నమోదు ప్రక్రియ జరుగుతోందని ఆర్డీఓ వెంకటేశులు తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయన అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటు నమోదు ప్రక్రియకు సహకరించాలని.. ఏవైనా మీకు అభ్యంతరాలు ఉంటే తెలపాలని.. ప్రతి వార్డులో ఉన్న ప్రతి ఇంటికి బీఎల్ఓ వస్తారని, అలా కాకుండా బీఎల్ఓలు విధులలో మాత్రం అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల నలుగురు బీఎల్ఓలను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. పులివెందుల మున్సిపాలిటీకి సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియలో సమస్యలు ఉన్నాయా అని నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 17వ తేదీ ప్రారంభమై పది నెలల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని.. ఆ తర్వాత నుంచి ప్రతి గ్రామంలో స్పెసల్ క్యాంపును కూడా పెట్టడం జరుగుతుందన్నారు. బీఎల్ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఉంటుందని.. అప్పుడు కూడా ఎవరైనా ఓటు నమోదు, చేర్పులు, మార్పులు కూడా చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హాఫీజ్, టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, జనసేన పార్టీ నాయకులు శ్రీపతి శ్రీనివాసులు, ఇతర పార్టీల నాయకులు, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ వెంకటప్రసాద్

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంవీఐ వెంకటప్రసాద్ హాజరై మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను తెలుపుతూ లైసెన్స్ పొందడానికి కావాల్సిన అర్హతలను వివరించారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణం హానికరమని, వాహనాలను నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుధీర, పీఆర్ఓ బాలనారాయణ, సిప్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న మానవత సంస్థ



అనాథ మహిళ జయలక్ష్మికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేంపల్లె : వేంపల్లె ఆర్టీసీ బస్టాండు ఆవరణలో అనాథగా పడి ఉన్న జయలక్ష్మి అనే మహిళను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అక్కున చేర్చుకుని తమ మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలలోకి వెళితే గత కొన్ని రోజులుగా నిస్సహాయ స్థితిలో, ఆరోగ్య పరిస్థితి బాగాలేక ఓ అనాథ మహిళ ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఉన్న చెట్టు కింద తలదాచుకుంటోంది. అలాగే మహిళ జయలక్ష్మి పూర్తి చలనం లేకుండా పడి ఉండటాన్ని గమనించిన పోలీస్ కానిస్టేబుల్ రవి తన సహచర మిత్రుడు, మానవత సంస్థ డైరెక్టర్ కానిస్టేబుల్ రఘునాథ్‌కు ఈ విషయాన్ని చేరవేశారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, సహాయ చైర్మన్ కృష్ణతేజలకు సమాచారం అందించారు. వారు ఆ మహిళను మానవత శాంతి రథం ద్వారా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఖరీఫ్‌లో పంటలను నమోదు చేయించుకోవాలి

ముద్దనూరు : ప్రస్తుత ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. 2023 ఖరీఫ్‌లో సాగు చేసిన పంట నమోదు కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమైందని, వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద పంటలను నమోదు చేస్తున్నారని, ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి సాగుచేసిన పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సూచించారు.